క్లుప్తంగా

ఆర్యవైశ్య రాష్ట్ర మీడియా విభాగం చైర్మన్ నియామకం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన పి.సాయికుమార్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ ప్రెసిడెంట్ రామకృష్ణ టంగుటూరి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీక్లబ్ ప్రతినిధులు అభినందించారు.

విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.లక్ష విరాళం


దాత మోహన్ కృష్ణారెడ్డిని అభినందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణస్వామి

ద్వారకాతిరుమల : శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. అనపర్తికి చెందిన నల్లమిల్లి మోహన్ కృష్ణారెడ్డి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో సినీ దర్శకుడు


శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో సినీ దర్శకుడు గిరీశాయి

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రంగరంగ వైభవంగా చిత్ర దర్శకుడు గిరీశాయి శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గిరీశాయి మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను ఆదిత్యవర్మ, రంగరంగ వైభవంగా చిత్రాలకు దర్శకత్వం వహించినట్టు తెలిపారు.

అండగా సీఎం సహాయనిధి


నాగేంద్రకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కొంత కాలంగా తలసేమియా సమస్యతో బాధపడుతూ, ఆసుపత్రులకు తిరుగుతూ వైద్య ఖర్చుల కోసం సతమతమవుతున్న పొన్నూరి నాగేంద్ర సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్య తీవ్రతను గమనించిన ఎమ్మెల్యే బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం పెదవేగి మండలం రాయన్నపాలెంకు చెందిన పొన్నూరి నాగేంద్రకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3 లక్షల చెక్కును మంజూరు చేయించారు. బాధితుడికి శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని నారాయణేశ్వర్, పులపాక గాంధీ, పర్వతనేని జగన్, మాట్టా వరప్రసాద్, మంచినేని బుల్లియ్య, పొన్నూరి సత్యనారాయణ, చల్లారి సత్యనారాయణ, పొన్నూరి శోభన్‌బాబు, పామర్తి వీర్రాజు, పులపాక రాటాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు, అరవిందుని 150వ జయంత్యుత్సవం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పూర్వవిద్యార్థులు, కళాశాల విద్యార్థులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలాభాస్కర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాలలోని మూర్తిరాజు విగ్రహానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భాస్కర్, ఎమ్మెల్యే వాసుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా ఎమ్మెల్యే వాసుబాబు, ప్రజాప్రతినిధులు నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పోలా భాస్కర్ తన ప్రసంగంలో సూచించారు. తక్కువ శాతం మంది డిగ్రీ కోర్సులలో చేరుతున్నారని ఆయన అన్నారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలు మనుగడకు ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు. విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్న దాతలను ఆయన అభినందించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- లక్కవరంలో గడపగడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమ పథకాలతో అర్హత గల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పథకాలు అందక ఇబ్బందులు పడిన అనేక మందికి ప్రస్తుత ప్రభుత్వంలో పథకాలు చేరువయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ వస్తున్నారన్నారు. నాలుగు సంవత్సరాల్లో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అద్భుతమైన లబ్ధి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ఏరకమైన లబ్ధి చేకూరిందని బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల కోసమే ప్రభుత్వం ఉందని, ప్రజల బాగోగులు చూసుకోవడమే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. లక్కవరంలో ఉన్న 2 సచివాలయాలకు రూ.40 లక్షలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గెల్లా వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మహిళా నేత ఉన్నమట్ల ఝాన్సీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైస్ ఎంపీపీ సరెడ్ల బుజ్జిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వందనపు సూర్యప్రకాష్‌రావు, దల్లి నాగేశ్వరరావు, చిల్ల దుర్గారెడ్డి, రామకృష్ణ, చిట్టిబొమ్మ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటివెలుగు పరీక్షల పరిశీలన

పెదపాడు: మూడో విడత డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు ప్రతి ఒక్కరికీ నిర్వహించాలని ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు ఆశా తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామ శివారు దాసరి గూడెంలో వైఎస్సార్ కంటివెలు పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారికి పలు సూచనలు సలహాలు అందించారు. కంటి వెలుగు పరీక్షల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందించేలా ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది చర్యలు చేపట్లాలని వారి ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూసారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ దివ్య, ఎంపీహెచ్‌ఈఓలు బసవరాజు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో అవకతవకలు

- నిబంధనలు పాటించడం లేదంటున్న ప్రజాప్రతినిధులు
- హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

కొయ్యలగూడెం : జాతీయ ప్రధాన రహదారి 516 (డి) విస్తరణ నేపథ్యంలో భాగంగా బయ్యనగూడెం గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, పీఏసీఎస్ చైర్మన్ కోరుకొండ బాపిరాజు పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాణంలోని అవకతవకలపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం మధ్యలో వెళ్లిన జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా 500 మీటర్ల చొప్పున పక్కా డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్నారని, అయితే ఇందులో కొన్నిచోట్ల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. నాణ్యత లేని ఐరన్‌ను ఉపయోగించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా డ్రెయినేజీ నిర్మించారన్నారు. హెచ్చుతగ్గులతో ఇష్టానుసారంగా డ్రెయినేజీ నిర్మిస్తున్నారని, దీనివల్ల కొన్నిచోట్ల డ్రెయినేజీ రోడ్డు మీదకు చొచ్చుకు వచ్చి మరికొన్నిచోట్ల నివాసిత ప్రాంతాలలోకి వచ్చేట్టు ఎగుడు దిగుడుగా నిర్మించారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సూచించిన ఆక్రమణల మార్కును వదిలి డ్రెయిన్ నిర్మిస్తున్నారన్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు వారు ఎటువంటి విచారణ నిర్వహించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బయ్యనగూడెంలో వివాదాస్పదంగా మారిన డ్రెయినేజీ నిర్మాణం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లకు మంటలు అంటుకున్న దృశ్యం

కుక్కునూరు : షార్ట్‌సర్క్యూట్ కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు మంటల్లో కాలిన ఘటన శనివారం గాంధీనగర్ ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్ ప్రాంతంలో బస్టాండ్‌కు వెళ్లే దారి పక్కన గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం సాయంత్రం సమయంలో వైర్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటల చెలరేగాయి. కాగా ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానంగా ఉన్న విద్యుత్ తీగలు మంటల్లో కాలాయి. దీంతో స్థానికులు వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ ఘటనతో మండల కేంద్రంలో కొన్ని ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

పారిజాతగిరిలో పూజలు


పూజలందుకుంటున్న శ్రీవెంకటేశ్వరస్వామి వారు

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాద గోష్ఠి, అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు 2వ శనివారం సెలవు, ఏకాదశి కావడంతో భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఏజెన్సీలో నలుమూలల నుంచి కాలినడకన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారన్నారు. తిరుమలదేవిపేటకు చెందిన రాజనాల బ్రహ్మయ్య, కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు నల్లూరి రవి కుమారాచార్యులు, వేద పండితుల ఆశీస్సులతో దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కంది బాలకృష్ణారెడ్డి, రెడ్డి రంగప్రసాద్, ఉప్పల గంగాదర్, వాసవిశాయి నగేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ ఏర్పాటుకు కృషి


వెంకటాద్రిగూడెంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌పీ రామారావు, ఎంపీటీసీ చింతం కృష్ణారావు అన్నారు. మండలంలోని వెంకటాద్రిగూడెంలో శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను బాలింతలకు, గర్భిణులకు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలంటే, అందరికీ పౌష్టికాహారం అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారని, బాలింతలు అయితే చిన్నారులకు పోషణ చేసే సమయంలో వారికి అన్ని పోషకాలు అందే అవకాశం ఉంటుందన్నారు. దీని వల్ల రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం తదితర సమస్యలు ఉండన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతం నాగబాబు, వార్డుసభ్యులు పోతుమర్తి రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ చెన్ను అనిల్‌కుమార్, చింతం శ్రీను, నాగ నాగు, సీహెచ్ భాస్కరరావు, రావిపాటి నాగన్న, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి


హనుమాన్లగూడెంలో మొలకలు వచ్చిన కొబ్బరి మొక్కలతో నిరసన తెలుపుతున్న రైతులు

ద్వారకాతిరుమల: ఈనెల 14న జరిగే చలో ఏలూరు కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాన్లగూడెంలోని కొబ్బరి తోటలో మొలకలు వచ్చిన కొబ్బరి కాయలతో రైతులు శనివారం నిరసన తెలిపారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరచి, కొబ్బరి రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 14న ఉదయం 10 గంటలకు జరిగే కొబ్బరి రైతుల చలో ఏలూరు కలెక్టరేట్ ధర్నా, జిల్లా కలెక్టర్‌కు రాయబార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కొబ్బరి రైతులు మద్దిపాటి దుర్గారావు, బొబ్బా బాలాజీ, దండమూడి పార్థసారథి, బి.తేజ తదితరులున్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత తమ బంగారు భవిష్యత్‌ను తామే తీర్చిదిద్దుకోవాలని, ఉన్నతమైన లక్ష్యాలను అకుంఠిత దీక్షతో చేరుకోవాలని సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్ పిలుపునిచ్చారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యువజన దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది సుస్థిర ప్రపంచం కోసం యువతకు హరిత నైపుణ్యం అనే అంశంపై అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్లోబల్ వార్మింగ్, ప్లాస్టిక్ వినియోగం నిరోధించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు రాఘవాపురానికి చెందిన స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సహకారంతో జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వయోజన విద్య ఏపీఓ విజయకుమార్, సెట్‌వెల్ ఏఓ కేజే కెనడీ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ ఎస్ పట్టాభిరామన్న, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన మరీదు పాపాయమ్మ (72) ఈ నెల 10వ తేదీ ఉదయం కళ్లు తిరిగి ఇంటి వద్ద పడిపోయింది. దీంతో ఆమె తలకు గాయమైంది. వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 172 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలకు 154 మంది విద్యార్థులకు 150 మంది, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 72కు గాను 22 మంది శనివారం హాజరయ్యారు. ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

క్రైస్తవులపై అక్రమ దాడులను ఆపాలి



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న రోమన్ క్యాథలిక్ మిషన్ సంఘస్తులు

కామవరపుకోట : గత కొన్ని నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న అక్రమ దాడులను ఆపాలని కోరుతూ మండలంలో కొత్తూరు రోమన్ క్యాథలిక్ మిషన్ విచారణ పరిధిలో ఫాదర్ పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో క్రైస్తవులు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్ నుంచి బస్టాండ్, చెక్‌పోస్ట్, దుర్గ మహల్ మీదుగా చౌతన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం ఫాదర్‌లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను వెంటనే అరికట్టాలని, ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎం ఫాదర్లు లీనో, పాస్కలీ, విజయప్రసాద్, కళ్యాణ్, ఏసుపాదం, నతానీయేలు, మోక్షానందం, అబ్రహం, సంఘ విశ్వాసులు, పెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ


గుండుగొలనులో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: దివ్యాంగులను ఆదుకోవడం సమాజానికి సేవలందించడమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వరప్రసాద్ అన్నారు. గుండుగొలనులో విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గ్రామానికి చెందిన కొనకళ్ల మోహనరావు, అనంత్ వితరణతో 60 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వర ప్రసాద్, భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్, విజయవాడకు చెందిన ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ సురేష్, తెర్లి భానురేఖ పాల్గొని ప్రసంగించారు. వైద్యులు తెర్లి సురేష్, తెర్లి భానురేఖ మాట్లాడుతూ తమ వంతు సేవా సమితికి అండదండగా ఉంటామని, ప్రతి నెల గ్రామంలోని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సమితి నిర్వాహకులు, పెద్దలు పాల్గొన్నారు.

క్విజ్, చర్చల ద్వారా అవగాహన



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడినా, చర్చ చేసినా, క్విజ్‌లో పాల్గొన్నా విద్యార్థుల అవగాహన పెరగడానికి సహాయ పడుతుందని బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ వై.ఆనంద నాయుడు, ఇంగ్లిష్ రిటైర్డ్ లెక్చరర్స్ డి.దిలీప్ కుమార్, పి.ఆంజనేయులు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుబ్బమ్మదేవి హైస్కూల్లో ఏలూరు పరిసర ప్రాంతాల హై స్కూల్ విద్యార్థులకు వక్తృత్వ, కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలో సీఆర్ రెడ్డి ఇంటర్ విద్యార్థులు సీహెచ్ నగేష్, ఏవీఎస్ఎన్‌డీ కుమార్, ఎం హరిచరణ్ బృందం మొదటి, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు పీజేఎస్ సిద్ధార్థ, బి.త్రినాథ్ బృందం రెండో స్థానంలో నిలిచారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు, మన్య విప్లవం పాత్ర అనే అంశంపై తెలుగులో వక్తృత్వ పోటీలో ఎస్కే రెహానా (జింగిల్ బెల్స్), టి.పుష్కల (శ్రీ శ్రీ స్కూల్), కె.తేజకిరణ్ (శ్రీ సూర్య ఇంగ్లిష్ మీడియం స్కూల్), జి.దివ్య (ఎల్‌బీసీ స్కూల్), ఆర్ హరీశ్వర్ (కేపీడీటీ హై స్కూల్), ఇంగ్లిష్‌లో ఆర్.శ్వాస్ (భాష్యం స్కూల్), డి.కార్తీక (శ్రీదీప్తి స్కూల్), ఆర్ గీతా చిన్నారి (ఏఆర్‌డీజీకే హై స్కూల్) వరుస స్థానాలు సాధించారు. వీరికి ఈనెల 15వ తేదీ సాయంత్రం కోటదిబ్బలోని సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో జరిగే సభలో బహుమతులు ప్రదానం చేస్తామని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద తెలిపారు. 100వ వర్ధంతి సందర్భంగా మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు, జి.శారద, ఎన్ గంగా భవాని, కె.లెనిన్ బాబులు నిర్వహించారు. కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పర్యవేక్షించారు.

ప్రతి ఓటరు వివరాలూ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి


బీఎల్వోలతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టరు సత్యనారాయణ

పెదపాడు: కలెక్టరు ఆదేశాల మేరకు బీఎల్వోలు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి వారి వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని డిప్యూటీ కలెక్టరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఈఆర్‌ఓ సత్యనారాయణ మాట్లాడుతూ పెదపాడు మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు ఇంటింటికీ తప్పనిసరిగా వెళ్లి వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. చనిపోయిన ఓటర్లను తొలగించాలన్నారు. గ్రామంలో లేని వారి ఓట్లు తొలగించాలన్నారు. వికలాంగుల ఓట్లు ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. 80 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ జీ విజయ కుమార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ యన్‌వీడీవీ ప్రసాద్‌బాబు బెవర కోటేశ్వరరావు, పుట్టా అజయ్, దామరాజు రవికుమార్, నటరాజన్‌దాసు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పొదుపుతోనే అభివృద్ధి, భద్రత

దెందులూరు: ప్రతి మహిళ పొదుపుతోనే భద్రత, అభివృద్ధి, సమాజంలో గౌరవం లభిస్తుందని మేధినరావుపాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు విడుదల సందర్భంగా డ్వాక్రా సంఘాల విస్తృత సమావేశం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. తొలుత గ్రూపుల వారీగా పొదుపు, చేస్తున్న వ్యాపారాలు, తిరిగి బ్యాంకులకు చెల్లిస్తున్న రుణాలు, రికార్డుల్లో తీర్మానాలపై అన్ని డ్వాక్రా సంఘాలతో సర్పంచ్ సమీక్షించారు. రుణాల మంజూరు, బ్యాంకుల సహకారంపై అడిగి తెలుసుకున్నారు. మహిళాభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డ్వాక్రా సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి సుమలత, డ్వాక్రా సీఏలు ఉన్నారు.

శ్రద్ధాంజలి

కీ.శే. నడిపల్లి నాగమణి గారు
W/o (Late) నడిపల్లి సత్యనారాయణ గారు (N.S.గారు)
జంగారెడ్డిగూడెం
మనుమడు : సాయి సాత్విక్
పెదకర్మ : ది.13.08.2023 ఆదివారం జంగారెడ్డిగూడెంలోని పాత బస్టాండ్‌లోని మా స్వగృహము నందు జరుపబడును.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com